



వినతిపత్రం ఇస్తున్న రైతుసంఘం నాయకులు

'పురం'... ఉద్రిక్తం..!

శ్రీ సత్య సాయి జిల్లా హిందూపురం పట్టణంలో శనివారం సాయంత్రం తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణపై వైసిపి నాయకుడు వేణురెడ్డి వ్యాఖ్యలు, టిడిపి నాయకులు వైసిపి కార్యాలయంపై దాడి అనంతరం పోటాపోటీగా టిడిపి, వైసిపి నాయకుల ఆందోళనలతో హిందూపురం అట్టుడికింది. పోలీసులు కలుగజేసుకుని రెండు పార్టీలకు సర్ది చెప్పి ఆందోళనలను విరమింపజేయడంతో పరిస్థితి దారిలోకి వచ్చింది.



వైసిపి కార్యాలయంపై దాడి చేస్తున్న టిడిపి శ్రేణులు

- వైసిపి కార్యాలయంపై టిడిపి దాడి
- ఫర్నిచర్ ధ్వంసం
- వైసిపి నేతల ఆందోళన
- బాలయ్యకు క్షమాపణ చెప్పాలని తెలుగు తమ్ముళ్ల రాస్తారోకో

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం నియోజకవర్గ పరిధిలోని లేపాక్షి మండలం సిరివరం గ్రామంలో శనివారం వైసీపీ చేపట్టిన రచ్చబండ, కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త దీపిక భర్త వేణు రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా హిందూపురం ఎమ్మెల్యే బాలకష్ణ మూడుసార్లు గెలిచినప్పటికీ అభివద్ధి మాత్రం జరగలేదని, బాలకష్ణ స్థానికుడు కాదని స్థానికులకు ఒకసారి అవకాశం కల్పించాలని పేర్కొన్నారు. వేణురెడ్డి మాట్లాడిన మాటలకు టిడిపి నాయకులు కోపోద్రిక్తులై ఒక్కసారిగా వైసిపి కార్యాలయంపై దాడి చేశారు. ఈ విషయం తెలుసుకున్న పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ టిడిపి నాయకులు దౌర్జన్యంగా కార్యాలయాన్ని ధ్వంసం చేసిన దశ్యాలను పరిశీలించారు. అనంతరం వేణు రెడ్డితో కలిసి ఆమె దాడిని తీవ్రంగా ఖండించారు. హిందూపురంలో ఎన్నడూ లేని విధంగా టిడిపి నాయకులు దౌర్జన్యంగా వైసిపి కార్యాలయాన్ని ధ్వంసం చేయడం ప్రజాస్వామ్యమన్నారు. రాజకీయం చేయాలంటే ప్రజాస్వామ్యబద్ధంగా చేయాలని రౌడీయిజంతో, దాడులతో రాజకీయం చేస్తే సహించే ప్రసక్తే లేదని అన్నారు. వేణురెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యబద్ధంగా రాజకీయం చేయాలి తప్ప ఇలా రౌడీయిజంతో రాజకీయం చేస్తే భవిష్యత్తులో అదే రౌడీయిజం తామూ చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. దాడి విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే వైసీపీ కార్యాలయం వద్ద బందోబస్తులు ఏర్పాటు చేశారు. దాడిని నిరసిస్తూ వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీ చరణ్, వేణు రెడ్డి, మధుమతి రెడ్డి, ఇతర నాయకులతో కలిసి వన్‌టౌన్ స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి స్టేషన్ ముందు ధర్నా చేపట్టారు. అనంతరం సిఐ రాజగోపాల్ నాయుడును కలిసి దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిర్యాదు చేశారు. దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసు సైతం నమోదు చేయాలని కోరారు. కార్యాలయంలో ఉన్న అంబేద్కర్ చిత్రపటాన్ని సైతం ధ్వంసం చేశారని దీనిపై సైతం ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్లు జబీవుల్లా, బలరామిరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు, పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.



ధ్వంసం అయిన వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహం

టిడిపి రాస్తారోకో

ఎమ్మెల్యే బాలకృష్ణపై అనుచిత వ్యాఖ్యలు వ్యక్తులు చేసిన వేణు రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ తెలుగు తమ్ముళ్లు అంబేద్కర్ సర్కిల్లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వేణు రెడ్డి, వైసీపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు అంజినప్ప, సీనియర్ నాయకులు నాగరాజు, మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ పరిమళ తదితరులు మాట్లాడారు. వైసిపి అధికారంలో ఉన్న సమయంలో నియోజకవర్గంలో చిన్న అభివృద్ధి కూడా జరగలేదని ఆరోపించారు. వేణు రెడ్డి జగన్మోహన్ రెడ్డి అండతో నియోజకవర్గంలో ఉన్న పెన్నా నదిలో ఇసుకను పూర్తిగా బెంగళూరుకు తరలించి అమ్ముకున్నారని అన్నారు. హిందూపురం పట్టణ అభివద్ధి కోసం ఎమ్మెల్యే బాలకృష్ణ వందల కోట్లు నిధులు తీసుకువచ్చారన్నారు. అసత్య ఆరోపణలు చేసిన వేణు రెడ్డి బాలకష్ణకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

దాడి సరికాదు : సిపిఎం

హిందూపురం పట్టణంలో వైసీపీ కార్యాలయంపై టిడిపి అల్లరి మూకలు చేసిన దాడిని సిపిఎం జిల్లా కార్యదర్శి రామకష్ణ, జెడ్‌పి.శ్రీనివాసులు తీవ్రంగా ఖండించారు. హిందూపురం నియోజకవర్గంలో ఇలాంటి సంఘటనలు ఏరోజూ జరగలేదన్నారు. ఎన్నికల సమయంలో రాజకీయాలు చేస్తారు తప్ప, ఎన్నికల అనంతరం ఇలా దాడులు చేయడం అప్రజాస్వామ్యం అన్నారు. ఏ పార్టీకి అధికారం శాశ్వతం కాదని, ప్రతిపక్షంలో ఎవరున్న విమర్శలు చేయడం సర్వసాధారణం అన్నారు. అధికారంలో ఉన్న వారు ఇలా దాడులు చేయడం తగదన్నారు. నియోజకవర్గంలో తప్పుని ఎత్తి చూపిన పాత్రికేయులపై సైతం తప్పుడు కేసులు బనాయించడం తగదన్నారు. ఎమ్మెల్యే బాలకష్ణ వీటిని పరిశీలన చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని వారు కోరారు.



ఆందోళన చేస్తున్న వైసిపి నాయకులు



అంబేద్కర్ విగ్రహం వద్ద రాస్తారోకో చేస్తున్న టిడిపి శ్రేణులు

మొక్కజొన్నకు గిట్టుబాటు ధర కల్పించండి

ఎపి రైతుసంఘం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

మొక్కజొన్నకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక కలెక్టరేట్లో డిఆర్‌ఒను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా అధ్యక్షులు హరి, సిపిఎం జిల్లా కార్యదర్శి రామకష్ణ మాట్లాడుతూ ఈ ఎడాది పెనుకొండతో పాటు, జిల్లా వ్యాప్తంగా రైతులు మొక్కజొన్న పంటను ఎక్కువగా పండించారన్నారు. పంట సాగు చేయడానికి పెట్టుబడులు ఎక్కువ అయ్యాయన్నారు. పంట చేతికొచ్చే సమయానికి ధర పడిపోవడంతో రైతులకు పెట్టుబడులు కూడా చేతికందలేదన్నారు. దళారులు కేవలం రూ.1650 నుంచి రూ.1750కు కొనుగోలు చేస్తున్నారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి క్వింటా రూ.2600తో కొనుగోలు చేయాలని కోరారు. అన్ని ప్రాంతాల్లోనూ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్, ఫిరంగి ప్రవీణ్ కుమార్, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు పైపల్లి గంగాధర్ తదితరులు ఉన్నారు.

లోకాయుక్త ఆదేశాలతో రియల్టర్ అక్రమాలకు చెక్

నదిపై బ్రిడ్జి, ఎపిఐఐసి భూముల్లో ఫారంపాండ్ తొలగింపు

ప్రజాశక్తి-చిలమత్తూరు

ఎన్నాళ్లగానో ప్రస్తావనలో ఉన్న రియల్టర్ రెడ్డెప్పశెట్టి అక్రమాలకు చివరకు చెక్ పడింది. ప్రజాశక్తి ప్రచురించిన వరుస కథనాలు అధికార వ్యవస్థను కదిలించగా, రెడ్డెప్పశెట్టి అక్రమ దందాలను లోకాయుక్త సీరియస్‌గా స్పందించింది.




బ్రిడ్జిని తొలగిస్తున్న అధికారులు


మండలంలోని కోడూరు పంచాయతీ మొరంపల్లి గ్రామ సమీపంలో చిత్రావతి నదిపై అనుమతి లేకుండా నిర్మించిన బ్రిడ్జి, ప్రభుత్వ భూముల ఆక్రమణ, ఎపిఐఐసి భూముల్లో అనధికార పాండ్లు, పాలీహౌస్‌ల పేరుతో అక్రమాలకు పాల్పడినా అధికారుల చూసీ చూడనట్లు వ్యవహరించారు. అయితే ఆర్‌టిఐ కార్యకర్త ఆంజనేయులు సెప్టెంబర్ 11వ తేదీ లోకాయుక్తాలో ఫిర్యాదు చేయడంతో ఉన్నతాధికారులు స్పందించారు. లోకాయుక్త నోటీసులు జిల్లా కలెక్టర్ సహా ఇతర శాఖల అధికారులు అందుకోవడంతో శనివారం ఉదయం కార్యకలాపాలు వేగం పుంజుకున్నాయి. రెడ్డెప్పశెట్టి ఎస్టేట్‌లో నదిపై నిర్మించిన అక్రమ బ్రిడ్జిని పూర్తిగా తొలగించారు. ఎపిఐఐసి భూముల్లో ఏర్పాటైన ఫారంపాండ్‌ను తొలగిస్తూ, దానికి సంబంధించిన పత్రాలను పరిశీలిస్తున్నారు. పాలీహౌస్ అనుమతుల్లో జరిగిన అవకతవకలపై విచారణకు అధికారులు ఆదేశించారు. సుమారు రూ. 5 కోట్లకు పైగా జరిగిన ఈ అక్రమాలపై ఈ నెల 18వతేదీ లోపు నివేదిక సమర్పించాలని లోకాయుక్త గడువు విధించడంతో అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఎలుగుబంట్లు, చిరుతల సంచారం..!

భయాందోళనలో అటవీ సమీప గ్రామాల ప్రజలు - పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-గుడిబండ





కొన్ని రోజులుగా గుడిబండతో సహా మండలంలోని పలు గ్రామాల సమీపంలో ఎలుగుబంట్లు, చిరుతలు సంచరిస్తున్నట్లు తెలుస్తోంది. ఒకానొక సమయంలో అవి జనావాసాలకు అత్యంత దగ్గరగా వస్తుండడంతో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. అడవిలో ఆహారం, నీరు లభించక పోవడంతోనే ఎలుగుబంట్లు, చిరుతలు, తదితర అడవి జంతువులు గ్రామాల వైపు వస్తున్నాయని చెప్పవచ్చు. ప్రధానంగా గుడ్డదహళ్లి, జిఎస్.తండా, పిసి.గిరి, మేకలగట్ట, ఎస్-ఎస్.గుండ్లు, పూజారిపల్లి, ఎస్.రాయపురం, మందలపల్లి, హిరేతుర్పి, దాసరపల్లి, కరికెర, శంకరగల్లు, రాళ్లపల్లి, మదిగుబ్బ, మైనగానపల్లి, కేకాతి, రామయ్యనహట్టి, బూదిపల్లి, కెడి.పాల్యం, తదితర గ్రామాలు అడవులకు అత్యంత సమీపంలో ఉండడంతో ఎలుగుబంట్లు, చిరుతలు, తదితర అడవి జంతువులు ఆహారం, నీటి కోసం ఆయా గ్రామాల వైపు వస్తున్నాయి. ఈ క్రమంలో అడవి జంతులు ప్రజలు, గొర్రెలకాపరులపై దాడి చేసిన సందర్భాలు అనేకం ఉన్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు కొన్ని రోజులుగా ఆయా గ్రామాల్లో మేకలు, ఆవులు, గొర్రెల మందలపై చిరుతలు దాడులు చేయడం, వాటిని చంపడం లాంటి సంఘటనలతో ప్రజలు తీవ్ర భయాందోళనలు వ్యక్తం అవుతున్నాయి. ఈ మధ్యకాలంలో గుడిబండతో పాటు హిరేతుర్తి, దాసరపల్లి, రామయ్యనహట్టి, మదిగుబ్బ, శంకరగళ్లు, కెంచయ్యపాలెం, ఎస్-ఎస్.గుండ్లు, పూజారిపల్లి, మేకలగట్టు, తదితర గ్రామాల్లో వారంలో రెండు మూడు సార్లు ఎలుగుబంట్లు, చిరుతలు కనిపించాయని ఆయా గ్రామాలు ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ఇకనైనా సంబంధిత అటవీశాఖ అధికారులు వెంటనే స్పందించి ఎలుగుబంట్లు, చిరుతల గ్రామాల వైపు రాకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మహిళా సమానత్వాన్ని గుర్తిద్దాం

కథలు, కవిత్వ సంకలనాల ఆవిష్కరణలో వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సమాజంలో మహిళా సమనత్వాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించి వారికి తగిన ప్రాధాన్యత, ప్రోత్సాహం ఇవ్వాలని పలువురు కవులు, రచయితలు పిలుపునిచ్చారు. ఐద్వా 16వ రాష్ట్ర మహాసభల సందర్భంగా రూపొందించిన కథ, కవిత్వం సంకలనాల పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని శనివారం సాయంత్రం అనంతపురం ఎన్జీవో హోంలో నిర్వహించారు. 'ఎక్కడమ్మా నువ్వు లేనిది' అనే పుస్తకాన్ని వేలూరి యంగన్న, 'ఆధునిక మహిళా చరిత్రను తిరిగి రచిస్తుంది' పుస్తకాన్ని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్‌లు కవులు, రచయితలతో కలిసి ఆవిష్కరించారు. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.సావిత్రి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పుస్తకాల అనువాద కర్త ప్రొఫెసర్ రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. రెండు పుస్తకాల ఆవశ్యకతను ఆయన తెలియజేశారు. సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సంఘర్షణలకు కథా, కవిత్వం పుస్తకాలు నిలిచాయన్నారు. స్త్రీలు వారి హక్కుల పొందేందుకు చేస్తున్న ప్రయత్నాల్లో ఇలాంటి పుస్తకాలు వారికి దోహదం చేస్తాయన్నారు. మహిళా సమానత్వం ఎవరో ఇస్తే రాదని, దాని పోరాడి సాధించుకోవాలని పిలుపునిచ్చారు. అధ్యపకులు అరుణ కాకి, షమీఉల్లాలు ఎక్కడమ్మ నీవు లేనిది పుస్తకం ఆవశ్యకతను తెలియజేశారు. రచయత రాజారాం ఆధునిక మహిళ చరిత్రను తిరగరాస్తుంది అనే పుస్తక సంకలనం గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్యామల, చంద్రిక, డాక్టర్ ప్రసూన, పుస్తక సమీక్షకులు డాక్టర్ షమీవుల్లా, అధ్యాపకులు అరుణ, రాజారాం, ఐద్వా నగర అధ్యక్ష,కార్యదర్శులు శంషాద్, అశ్వినితో పాటు రచయితలు, కవులు, పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వక్తలు, కవులు, రచయితలు

అయ్యప్ప మాలధారులకు భోజన సౌకర్యం

ప్రజాశక్తి-హిందూపురం

అయ్యప్ప స్వామి మాలధారులకు సోమవారం నుండి మధ్యాహ్నం వేళ భోజన సౌకర్యం కల్పించనున్నట్లు అయ్యప్ప స్వామి అన్నదాన కమిటీ అధ్యక్షులు, మున్సిపల్ ఛైర్మన్ డిఈ రమేష్ కుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా రమేష్ కుమార్ మాట్లాడుతూ, బాలన్ గురుస్వామి శిష్యబందం ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో మాల ధరించిన అయ్యప్ప భక్తాదులు దీక్ష సజావుగా కొనసాగడానికి దాతలు సహాయ సహకారాలతో మధ్యాహ్న వేళ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జనవరి 3వ తేదీ వరకు మధ్యాహ్నం 1 గంట నుండి 3. 00 గంటల వరకు అన్నదానం కొనసాగుతుందన్నారు.

తిరుమలకు పాదయాత్రగా వెళ్తున్న బందానికి మున్సిపల్ ఛైర్మన్ రమేష్‌కుమార్ జెండా ఊపి వీడ్కోలు పలికారు. అంతకుముందు పట్టణంలోని బాలాజీ నగర్ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుమల వెంకటేశ్వర పాదయాత్ర బందం అధ్యక్షులు పురుషోత్తమ రెడ్డి, ఆలయ కమిటీ ఛైర్మన్ సుబ్బు, పేట వెంకటేశ్వర ఆలయ కమిటీ ఛైర్మన్ భగీరథ నవీన్, ఆలయ కమిటీ సభ్యులు టిపి.వెంకటేశులు, పాదయాత్ర బందం సభ్యులు పాల్గొన్నారు.



పోస్టర్లు విడదల చేస్తున్న మున్సిపల్ ఛైర్మన్

మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ నూతన కార్యవర్గం ఏర్పాటు

ప్రజాశక్తి-హిందూపురం

ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ హిందూపురం శాఖ కార్యవర్గాన్ని ఏంటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకట రెడ్డి శనివారం ప్రకటించారు. హిందూపురం పట్టణంలోని ఓరియంటల్ పాఠశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ప్రకటించి సన్మానించారు. అధ్యక్షులుగా టిఎండి.అన్సర్ అహ్మద్, ఉపాధ్యక్షులుగా టి.బాలకష్ణ, ప్రధాన కార్యదర్శిగా యం.గోవర్ధన్, ఆర్థిక కార్యదర్శిగా కెఎన్.సుదర్శన్ రెడ్డి, జిల్లా కౌన్సిలర్లను కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, డీఎస్సీ 2025లో రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ పాఠశాలలకు అన్యాయం జరిగిందని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో నూతనంగా ఉన్నతీకరించిన ఉన్నత పాఠశాలలు, మోడల్ ప్రైమరీ పాఠశాలలోనూ, ఉర్దూ పాఠశాలలోనూ ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా వేధిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సిద్ధగిరి శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెన్నోబులం,జిల్లా కార్యవర్గ సభ్యులు జనార్ధన్, బాలకష్ణ, నాగప్ప, ఓబులరాజు, రామాంజనేయులు ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



నూతన కార్యవర్గం అధ్యక్షులు, సభ్యులు

కార్మికులను వేధిస్తే సహించం

శ్రీరామిరెడ్డి తాగునీటి కార్మికుల పొట్టకొట్టొద్దు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

కార్మికులను బెదిరింపులకు గురి చేస్తూ, అక్రమ తొలగింపులకు పాల్పడడమే కూటమి ప్రభుత్వ రెడ్‌బుక్ రాజ్యాంగమా అని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ ప్రశ్నించారు. శ్రీరామిరెడ్డి తాగునీటి కార్మికులపై కాంట్రాక్టర్ అడపాల వెంకట్రావ్, స్థానిక ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పేరుచెబుతూ గౌతమ్, కిరణ్‌లు కార్మికులపై దౌర్జన్యం చేస్తున్నారని మండిపడ్డారు. శనివారం స్థానిక పంప్‌హౌస్ వద్ద కార్మికులతో సమావేశం నిర్వహించారు. అనంతరం డీఎస్పీ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాగేంద్రకుమార్ మాట్లాడుతూ రూ.6వేలు వేతనం తగ్గిస్తూ పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు ఉంటాయని చెప్పడం బాధాకరమన్నారు. కార్మికులతో బలవంతంగా వంద ఖాళీ బండ్లలో సంతకాలు చేసుకోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ఇలాంటి కాంట్రాక్టర్లు దౌర్జన్య పరులపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. శ్రీరామిరెడ్డి తాగునీటి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం వచ్చే సోమవారం నుంచి తహశీల్దార్ కార్యాలయ ఆవరణంలో రిలే నిరాహారదీక్షలు చేపడుతామని చెప్పారు. ఈవిషయాలను స్థానిక డీఎస్పీ రవిబాబుతో చర్చించారు. శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం ద్వారా కళ్యాణదుర్గం, రాయదుర్గం, మడకశిర, హిందూపురం నియోజకవర్గ ప్రజలకు తాగునీటి అందించేందుకు 15 సంవత్సరాలుగా కార్మికులు కష్టపడ్డారన్నారు. ఇలాంటి కార్మికులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం, అధికారులు, ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి రాము, కోశాధికారి వన్నూరుస్వామి, ఉపాధ్యక్షులు ప్రభాకర్, ప్రకాష్, అశోక్, రాజశేఖర్, గంగాధర, హనుమంతరెడ్డి, నరేష్, అనీల్, రామాంజినేయులు పాల్గొన్నారు.

ఎం.రాయపురం-హిందూపురం బస్సును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-గుడిబండ

గుడిబండ, రొళ్ల మండలాల ప్రజల సౌకర్యార్థం ఎం.రాయపురం టు హిందూపురం ఆర్టీసీ బస్సు ను యథావిధిగా పునరుద్ధరించాలని ఆయా మండలాల ప్రజలు కోరుతున్నారు. 20 ఏళ్లుగా హిందూపురం డిపో నుంచి హిందూపురం వయా మడకశిర, గుడిబండ, మోరుబాగల్ మీదుగా ఆర్టీసీ బస్సు ఎం.రాయపురం వెళ్లి రాత్రికి అక్కడే ఉండేది. మరుసటి రోజు వేకువజామున 5 గంటలకు అక్కడి నుంచి బయల్దేరి ఎం.రాయపురం వయా మోరుబాగల్, గుడిబండ, మడకశిర మీదుగా హిందూ పురం చేరుకునేది. ఈ బస్సు ఈ రెండు మండలాల్లోని సుమారు 60 గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉండేది. ప్రధానంగా ఇక్కడి రైతులు పండించిన మల్బరీ, చింతపండు, మిర్చి, ఉల్లి పాయ, తదితర పంటల దిగుబడిని ఈ బస్సు ద్వారా సకాలంలో హిందూపురం మార్కెట్‌కు తీసుకెళ్లే వారు. అలాగే మడకశిర, హిందూపురం, పెనుకొండ, అనంతపురం వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులకు ఈ బస్సు సర్వీస్ వేళలు అనుకూలంగా ఉండేవి. ఈ బస్సు రోజూ ఆయా గ్రామాల మీదుగా రెండుసార్లు రాకపోకలు సాగించేది. కలెక్షన్ కూడా బాగా అయ్యేది. అయితే ఆర్టీసీ అధికారులు సుమారు ఐదేళ్ల క్రితం ఉన్నఫళంగా ఈ సర్వీస్‌ను రద్దు చేయడంతో రైతులు, వ్యాపారులు, విద్యార్థులు, ఉద్యోగులు ఇలా అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ బస్సు సర్వీసును పునరుద్ధరించాలని కోరుతూ పలుమార్లు ప్రజాప్రతినిధులు, ఆర్టీసీ అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇకనైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే ఎం.రాయపు రం టు హిందూపురం ఆర్టీసీ బస్సు సర్వీసును యథావిధిగా పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన

ప్రజాశక్తి-హిందూపురం

ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలపై ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు శనివారం అవగాహన కల్పించారు. సప్తగిరి డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ -2 ఆధ్వర్యంలో హిందూపురం మండలం మణేసముద్రంలో డిగ్రీ,పీజీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనాథ్ రెడ్డి, కళాశాల పరిపాలన అధికారి బి.గంగిరెడ్డి ఎన్ఎస్ఎస్ పిఓ ఏ.కేశవరెడ్డి నేతత్వంలో వాలంటీర్లు గ్రామంలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సూపర్ సిక్స్ పథకాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి అవగాహన కల్పిస్తూ వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు


నివాళులర్పిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

బిర్సా ముండాకు కలెక్టర్ నివాళి

పుట్టపర్తి రూరల్ : జన జాతీయ గౌరవ్ దివస్ సందర్భంగా శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధులు బిర్సా ముండా జయంతి సభ నిర్వహించారు. ముందుగా బిర్సాముండా చిత్రపటానికి కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. బిర్సా ముండా దేశానికి చేసిన సేవలు వెలకట్టలేనివన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ సూర్యనారాయణరెడ్డి, కలెక్టరేట్ ఏఓ వెంకట నారాయణ, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి మోహన్‌రామ్, ఎస్‌డిసి రామసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

కరువు ప్రభావిత చిత్రాల సేకరణ

లేపాక్షి : లేపాక్షి, చోళసముద్రం గ్రామాల్లో శనివారం ప్రొఫెసర్స్ నరేష్‌బాబు, సత్యబాబు, కృష్ణానాయక్ ఎఐ ద్వారా డ్రోన్‌తో కరువు ప్రభావిత పంటల ఛాయాచిత్రాలను తీశారు. రైతులు నష్టపోయిన పంటల చిత్రాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి రైతులకు పరిహారం అందేలా కృషి చేస్తామన్నారు. వారి ఏవో శ్రీలత, హార్, రైతులు ఉన్నారు.

పాఠశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు

ప్రజాశక్తి-గోరంట్ల

పట్టణంలో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో దాతల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు హెచ్‌ఎం ఈశ్వర్ ప్రసాద్ తెలిపారు. పాఠశాలలో శనివారం హెచ్‌ఎం మాట్లాడుతూ 2001-02 విద్యా సంవత్సరం విద్యార్థులు వడల చంద్రారెడ్డి, శేషు సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు.

పలువురికి కేతిరెడ్డి పరామర్శ

ప్రజాశక్తి-బత్తలపల్లి

అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న పలువురు వైసిపి నాయకులను శనివారం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పరామర్శించారు. మండలంలోని ఉప్పర్లపల్లి గ్రామంలో వైసిపి యూత్ విభాగం మండల అధ్యక్షులు కొట్టం శేఖర్, దేవిరెడ్డి విజయ్‌కుమార్‌రెడ్డిని పరామర్శించారు. అనంతరం సూర్యచంద్రాపురం గ్రామం వెళ్లి సాకే లక్ష్మీనారాయణను పరామర్శించి వారికి భరోసా ఇచ్చారు. ఆయన వెంట చల్లా మహేష్, షరాబ్, యోగానందాచారి, మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి, వైస్ ఎంపిపి వెంగళరెడ్డి, సర్పంచి చల్లా కరుణాకర్ నాయుడు, లింగారెడ్డి, చెన్నారెడ్డి, రమణారెడ్డి, ఈశ్వరయ్య, ఆదిశేషయ్య, ఓబులయ్య, వెంకట్, శేఖర్, అభినేష్, నెట్టికంటి, గుర్రప్ప, ఆదినారాయణ, రవీంద్రనాయుడు, వెంకటపతి, మంజుల రమణ, అజయ్, సాంబశివ, ఉన్నారు.

రామాలయంలో మాజీ ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-బత్తలపల్లి

మండలంలోని గంటాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు నిర్వహించి 41 రోజులు పూర్తి కావడంతో శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆలయానికి వెళ్లి స్వామి వారిని దర్శించుకున్నారు. అంతకుముందు స్థానిక వైసిపి నాయకులు, పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కేతిరెడ్డి వెంట నాయకులు కమతం ఈశ్వరయ్య, చల్లా మహేష్, కోటి సురేష్ కుమార్, షరాబ్, యోగానందాచారి, మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి, కోటి నరేష్‌కుమార్, సాంబశివ, తదితరులు ఉన్నారు.


కేతిరెడ్డికి స్వాగతం పలుకుతున్న వైసిపి నాయకులు

బాబా సమాధిని దర్శించుకున్న కేంద్ర మంత్రి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయుష్ గోయల్ శనివారం పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో సత్యసాయి బాబా మహాసమాధిని దర్శించుకున్నారు. అంతకుముందు కేంద్రమంత్రికి పుట్టపర్తి విమానా శ్రయంలో కూటమి నాయకులు ఘన స్వాగతం పలికారు. సత్యసాయి బాబా శత జయంత్యుత్సవాల్లో పాల్గొనేందుకు ఆయన ప్రత్యేక విమానంలో రాగా పుట్టపర్తి విమానాశ్రయం లో కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ ఎస్.సతీష్ కుమార్, బిజెపి నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు జిఎం.శేఖర్, మాజీ మంత్రి పల్లె రఘు నాథ్‌రెడ్డి, ఆర్డీవో సువర్ణ, ఎల్‌ఐసి నరసిం హులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి పూలబొకేలు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన ప్రశాంతి నిలయంలోని శాంతిభవన్‌కు చేరుకోగా అక్కడ సత్య సాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్, ఇతరులు ఆత్మీయ స్వాగతం పలికారు. కొద్దిసేపు విశ్రాంతి అనంతరం కేంద్ర మంత్రి భగవాన్ శ్రీసత్య సాయిబాబా మహా సమాధిని దర్శించుకు న్నారు. మంత్రి మాట్లాడుతూ భగవాన్ ప్రేమ, నిస్వార్థ సేవా సందేశాన్ని ప్రశాంతి నిలయం అనేక కార్యక్రమాల ద్వారా ప్రపంచం అంతట వ్యాప్తి చేయడం అభినందనీయమన్నారు. బాబా మానవాళికి అందించిన సేవలు వెలకట్టలేనివి అన్నారు. అందరూ ఆయన మార్గంలో నడవాలన్నారు. బాబా శతజయంతి ఉత్సవాల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. సేవాదళ్ సభ్యులు, భక్తులు, సెంట్రల్ ట్రస్ట్ చేస్తున్న విశిష్ట సేవలను ప్రత్యేకంగా ప్రశంసించారు.


బాబా సమాధిని దర్శించుకున్న కేంద్ర మంత్రి

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కదిరి అర్బన్

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని కెజిబివిలో 'పర్సనల్ అండ్ కమ్యూనిటీ హైజిన్' థీమ్‌లో భాగంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. సమాజ పరిశుభ్రత ప్రాముఖ్యతపై అవగాహన కల్పించేలా ప్రజా భాగస్వామ్యంతో పరిశుభ్రమైన ఆంధ్ర ప్రదేశ్ నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర మిషన్ కమిషన్ డైరెక్టర్ పర్వీన్‌బాను, మున్సిపల్ ఛైర్‌పర్సన్ దిల్షాద్‌ఉన్నీసా, వైస్‌ఛైర్మన్ రాజశేఖరాచారి, పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, కౌన్సిలర్లు, అధికారులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు .


కెజిబివిలో విద్యార్థినులతో ఎమ్మెల్యే కందికుంట

డిప్యూటీ సిఎంపై అసత్య ఆరోపణలు చేస్తే సహించం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

డిప్యూటీ సిఎం, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌పై పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఇష్టానుసారం నోరు పారేసుకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్య దర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి హెచ్చరించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పెద్దిరెడ్డి భూ కబ్జాలు, ఆక్రమణలను తీవ్రంగా ఎండగట్టారు. దోషులు కాకపోతే మీరే సిబిఐ విచారణ కోరి మీ నిజాయితీని నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. పవన్ కళ్యాణ్ నిస్వార్థ నాయకుడన్నారు. పెద్దిరెడ్డి దోపిడీని, భూ భాగోతాన్ని ప్రజల దృష్టికి తీసుకొచ్చారన్నారు. అనవసరంగా సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్‌పై విమర్శలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. తిరుమల కల్తీ నెయ్యి విషయంలో ఫిర్యాదుదారు రైల్వే సిఐ సతీష్‌కుమార్ మృతిపై నిజానిజాలు బయటకు తీయాలని కోరారు.

జగన్‌పై అనుచిత వ్యాఖ్యలు తగదు

ప్రజాశక్తి-కొత్తచెరువు

వైసిపి అధినేత, మాజీ సిఎం జగన్, మాజీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిపై పుట్టపర్తి నియోజకవర్గ జనసేన నాయకుడు అబ్దుల్లా చేసిన అనుచిత వ్యాఖ్యలను వైసిపి నాయకులు ఖండించారు. స్థానిక వైసిపి కార్యాలయంలో శనివారం వైసిపి మండల కన్వీనర్ శ్యామ్‌సుందర్‌రెడ్డి, నాయకులు మాల రామాంజనే యులు, వాల్మీకి శంకర్, హనుమంతరెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వైసిపి పాలనలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేశారన్నారు. ప్రధానంగా పులివెందుల-బెంగళూరు నేషనల్ హైవే, బెంగళూరు-విజయవాడ హైవే, ముదిగుబ్బ-పుట్టపర్తి హైవేలు తెచ్చిన ఘనత వారికే దక్కిందన్నారు. పేదలకు 3,500 గృహాలు నిర్మించారన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఈ రెండేళ్లలో ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేదన్నారు. విమర్శించే ముందు స్థాయి తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎ.శ్రీనివాసులు, ఎంపిటిసి రఫీ, బేల్దారి ఎల్లప్ప, విజయ్‌కుమార్, చెంద్రాయుడు, అశోక్, పెద్దన్న, మారుతి, నాగరాజు, నామాల విష్ణు, వాజిద్, తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి సామాజిక సమస్య

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

కుష్టు వ్యాధి కేవలం ఆరోగ్య సమస్యగానే కాకుండా సామాజిక సమస్యగా పరిగణిస్తారని ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యాధికారి డాక్టర్ కమల్ రోహిత్ తెలిపారు. స్థానిక పిహెచ్‌సిలో శనివారం సిబ్బందికి ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ కుష్టు వ్యాధిపై అపోహలు, నమ్మకాలు తొలగించి, అంగవైకల్యం ఏర్పడే ప్రమాద పరిస్థితి నుంచి రక్షించాలని సూచిం చారు. లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలన్నారు. కుష్టు అనుమానిత కేసులను నిర్ధారిస్తూ చికిత్స అందజేయాలని సూచించారు. ఈ నెల 17 నుంచి 30వ తేదీ వరకూ ఇంటింటా సర్వే చేసి వ్యాధిగ్రస్తులను గుర్తించాలని, వారికి ఆరోగ్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది ప్రమీల, దిల్‌షాద్, రామకృష్ణమ్మ, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ర్యాలీ

ప్రజాశక్తి-రొద్దం

'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'లో భాగంగా శనివారం స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో చేపట్టిన కార్యక్రమంలో పంచాయతీ అధికారులు, ఐసిడిఎస్, ప్రభుత్వ హైస్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు 'నేను నా పరిసరాల పరిశుభ్రత కోసం ప్రతిరోజు కొద్ది సమయం కేటాయిస్తా' అని ప్రతిజ్ఞ చేయించారు. అలాగే ఆర్.మరవపల్లిలో ఎంపిపి పాఠశాల ఉపాధ్యాయులు, సత్య శేఖర్ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.


స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ర్యాలీ చేపట్టిన ఉపాధ్యాయులు, అధికారులు

బాబా ఫ్లెక్సీలు, చిత్రాలు మాత్రమే ఉండాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కొత్తచెరువు



ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తిలో భగవాన్ శ్రీసత్యసాయి బాబా చిత్రాలు, ఫ్లెక్సీలు మాత్రమే ఉండాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి తెలిపారు. సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలకు దేశ విదేశాల నుంచి లక్షలాది మంది భక్తులు వస్తారని, కావున రాజకీయాలకు అతీతంగా పుట్టపర్తి, పరిసర ప్రాంతాల్లో సత్యసాయి బాబా చిత్ర పటాలు, ఫ్లెక్సీలు తప్ప వేరే ఇతర రాజకీయ, వ్యక్తిగత ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకూడదని వారు స్పష్టం చేశారు.

'పది' పరీక్ష కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహించేందుకు శనివారం ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ లాజర్, పెనుగొండ డివిజన్ ఉప విద్యాధికారి జాన్ రెడ్డప్ప పాఠశాలలను పరిశీలించారు. అందులో భాగంగా కెజిబివి, జీవన్ జ్యోతి స్కూల్, శ్రీవిజ్ఞాన్‌స్కూల్, విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, జడ్పీ హైస్కూల్‌ను పరిశీలించారు. ఈ కేంద్రాల్లో బల్లలు, విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులు బాగా చదివి మంచి మార్కులతో వంద శాతం ఉత్తీర్ణులు కావాలని సూచించారు. వారి వెంట ఎంఇఒ రమణ, స్కూల్ కరస్పాండెంట్ ఫక్రుద్దీన్, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతపై విచారణ

ప్రజాశక్తి-గుడిబండ

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యతపై శనివారం విద్యాశాఖ అధికారులు విచారణ చేపట్టారు. భోజనం నాణ్యతగా లేదని గత శుక్రవారం విద్యార్థులు ఆందోళన చేపట్టడంపై శనివారం ప్రజాశక్తిలో వార్త వచ్చింది. దీంతో స్పందించిన ఎంఇఒలు ప్రసాద్‌రెడ్డి, జయ చంద్రకుమార్, జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం గోవిందప్ప, ఎస్‌ఎంసి ఛైర్మన్‌తో కలిసి డిప్యూటీ త హశీల్దార్ రాంభూపాల్‌రెడ్డి, డిప్యూటీ ఎంపిడిఒ నాయక్ సమక్షంలో భోజన ఏజెన్సీ నిర్వాహకుడిని పిలిపించి విచారణ చేపట్టారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని హెచ్చరించారు. ఈ విషయాన్ని డిఇఒ దృష్టికి తీసుకెళ్లినట్లు వారు తెలిపారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు


ప్రజాశక్తి-గోరంట్ల

మండలంలో వివిధ అభివృద్ధి పనులకు మంత్రి సవిత ఎన్‌ఆర్‌ఈజిఎస్ కింద రూ. 2.83 కోట్ల నిధులు మంజూరు చేయించారని టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణచౌదరి తెలిపారు. ఈ నిధులతో త్వరలోనే మంత్రి చేత సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేయిస్తామని తెలిపారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-తలుపుల

మండలంలోని గంజివారిపల్లి మర్రిమాను వద్ద శుక్రవారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొన్న ఘటనలో ఈదులకుంట్లపల్లి గ్రామానికి చెందిన వెంకటనారాయణ(55) అక్కడిక్కడే మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ స్పందించి తక్షణ సాయంగా రూ. 15 వేలు అందజేశారు. ఆ కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్ర మంలో టిడిపి నాయకులు మేడా శంకర్, సర్పంచి దేవేంద్రనాయక్, విశ్వనాథరెడ్డి, శ్రీశైలం, రమణ, ఆదినారాయణ, ఓబుళనాయుడు, సూర్యశేఖర్‌రెడ్డి, బాలునాయక్, రామ్‌ప్రసాద్, రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.


మృతుని కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న టిడిపి నాయకులు

కెజిబివి హాస్టల్ తనిఖీ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ప్రతి విద్యార్థి వ్యక్తిగత, సమాజ పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ సూచించారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని జగరాజుపల్లి కెజిబివిలో విద్యార్థులకు వాష్ అండ్ క్విట్ ప్రాక్టికల్ డెమో నిర్వహించారు. కలెక్టర్ కెజిబివిని సందర్శించి పరిసరాలను పరిశీలించారు. విద్యార్థినుల హాస్టల్‌ను సందర్శించి వారు ఉపయోగించే బెడ్స్, దుప్పట్లు, గదుల పరిశుభ్రతపై వార్డెన్‌ను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహాల పరిశుభ్రత విద్యార్థుల ఆరోగ్యానికి అత్యంత కీలకమని సూచించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ చేతులను శుభ్రంగా ఉంచుకోవడం, గోళ్లు కత్తిరించుకోవడం, టాయిలెట్ ఉపయోగించిన తర్వాత చేతులు సరిగా కడుక్కోవడం తప్పనిసరి అన్నారు. ఎవరూ బహిరంగ మలవిసర్జన చేయకుండా చూడాలని, పరిశుభ్రమైన సమాజం నిర్మించడం ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. కలెక్టర్ వెంట జిల్లా పంచాయతీ అధికారి సమత, డిఇఒ కిష్టప్ప, ఎంఇఒ, కెజిబివి ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు ఉన్నారు.


హాస్టల్‌లో విద్యార్థినుల దుప్పట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ప్రభుత్వం వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. డీఎస్సీ-2025 ద్వారా ఎంపికై మున్సిపాలిటీలో నియమితులైన నూతన ఉపాధ్యాయులకు శనివారం స్థానిక గణేష్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో స్వాగతం పలికి సర్వీస్ రిజిస్టర్లు, యుటిఎఫ్ బ్యాగులు అందజేశారు. జయ చంద్రారెడ్డి మాట్లాడుతూ యుటిఎఫ్ ఉన్నత లక్ష్యాలతో పని చేస్తుందన్నారు. లక్షకు పైగా ఉపాధ్యాయ సభ్యత్వం కలిగిన అతిపెద్ద ఉపాధ్యాయ సంఘం అన్నారు. విద్య, ఉపాధ్యాయుల సమస్యలపై రాజీలేని పోరాటాలు కొనసాగిస్తుంద న్నారు. నూతన ఉపాధ్యాయులు సభ్యులుగా చేరి సంఘాన్ని బలపరచాలని కోరారు. మున్సిపాలిటీ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని, డీఎస్సీ ద్వారా భర్తీ కాకుండా మిగిలిన పోస్టులను భర్తీ చేయాలని, అవసరమైతే వర్క్ అడ్జస్ట్మెంట్ ద్వారా ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలలకు ఉపాధ్యాయులను కేటాయించాలని, అర్బన్ ఎంఇఒ పోస్టులను కొత్తగా ఏర్పాటు చేసి వాటిని మున్సిపల్ ప్రధానోపాధ్యాయుల ద్వారా భర్తీ చేయాలని, ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్ డిఎలు విడుదల చేయాలని, పిఆర్‌సి కమిటీ వేయాలని, మధ్యంతర భృతి 30 శాతం ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి రామకృష్ణ నాయక్, లక్ష్మయ్య, డా. రామకృష్ణ, రామ్‌ప్రసాద్, సాయిగణేష్, రామాంజనేయులు, ఆంజనేయులు, నూతన ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

ముస్లిముల సంక్షేమం కూటమితోనే సాధ్యం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ముస్లిం మైనార్టీలకు మంచి చేసింది, చేసేది కూటమి ప్రభుత్వం మాత్రమేనని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ తెలిపారు. రాష్ట్రంలో ఇమామ్‌లు, మౌజన్లకు వేతనాలు చెల్లించడంతో శనివారం పట్టణంలో ముస్లిం మైనార్టీలతో కలిసి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. శ్రీరామ్ మాట్లాడుతూ హామీ ఇచ్చిన 24 గంటల్లోపే సిఎం చంద్రబాబు 2వ విడతలో రూ. 90 కోట్లు విడుదల చేశారన్నారు. ఇమామ్‌లకు రూ. 10వేలు, మౌజన్‌లకు రూ. 5వేల చొప్పున అందజేశా రన్నారు. పట్టణంలోని 32 మసీదులకు రూ. 57.6లక్షలు, నియోజకవర్గంలో ఉన్న 58 మసీదులకు రూ. 1.04కోట్లు అందించ న్నారు. గత వైసిపి ప్రభుత్వం ముస్లింలను కేవలం ఓటు బ్యాంకుగా చూసిందని, మైనార్టీల సంక్షేమాన్ని ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నా ప్రజల సంక్షేమానికి ఏమాత్రం లోటు చేయడం లేదన్నారు. అనంతరం ఇటీవల దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన షరీఫ్ మర్యాద పూర్వకంగా శ్రీరామ్‌ను కలిశారు. దూదేకుల్లో చాలా మంది నిరుపేదలు ఉన్నారని, అలాంటి వారిని గుర్తించి వారికి ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు అందేలా చూడాలని కోరారు. స్పందించిన శ్రీరామ్ దూదేకుల సమస్యలను సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు నా వంతు కృషి చేస్తానని తెలిపారు.


సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న శ్రీరామ్, ముస్లింలు

దుకాణంలోకి దూసుకెళ్లిన వాహనం.. ముగ్గురికి గాయాలు

నంబులపూలకుంట : స్థానిక కదిరి రహదారిలో నిర్వహిస్తున్న ఓ కూరగాయల దుకాణంలోకి శనివారం ఇన్నోవా వాహనం దూసుకెళ్లడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఎఎస్‌ఐ కిషోర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. ఆ దుకాణం వద్ద కొందరు వ్యక్తులు కూరగాయలు కొనుగోలు చేస్తుండగా ఉన్నఫళంగా అతివేగంగా వచ్చిన ఇన్నోవా వాహనం వారిపైకి దూసుకెళ్లింది. ఈ సంఘటనలో పాలెం శంకర, టి.శంకర, బి.మంజునాథ్ తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలిసిన వెంటనే ఎఎస్‌ఐ సంఘటనా స్థలాన్ని పరిశీలించి గాయపడిన వారిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం 108 వాహనంలో కదిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనలో మూడు ద్విచక్ర వాహనాలు, రెండు తోపుడు బండ్లు, కూరగాయల అంగడి దెబ్బతిన్నాయి. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


కూరగాయల దుకాణంలోకి దూసుకెళ్లిన ఇన్నోవా

భర్తపై కేసు నమోదు

కదిరి టౌన్ : భార్యపై దాడి చేసిన భర్తపై కేసు నమోదు చేసినట్లు శనివారం పట్టణ పోలీసులు తెలిపారు. పట్టణంలోని అడపాల వీధికి చెందిన బసెట్టి అరుణకు 16 ఏళ్ల క్రితం విశ్వనాథ్‌తో వివాహమైంది. వారికి ఓ కొడుకు, కూతురు సంతానం. భార్యతో గొడవపడిన విశ్వనాథ్ ఏడాదిగా అతడి స్వగ్రామమైన పట్నంలో ఉంటున్నాడు. గత శుక్రవారం అరుణ కదిరి పట్టణంలో పనికి పోయి ఇంటికి వస్తుండగా సైదాపురం ఆంజనేయస్వామి గుడి సమీపంలో అడపాల వీధిలో వెనుక వైపు నుంచి బైక్‌పై వచ్చిన విశ్వనాథ్ అరుణపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు విశ్వనాథ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

బాలిక అదృశ్యం

బత్తలపల్లి : తన కుమార్తె కనిపించడంలేదని మండలంలోని దంపెట్ల గ్రామానికి చెందిన మల్లెల ఆదినారాయణ శనివారం ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఆదినారాయణ కుమార్తె అనంతపురంలోని ఓ ప్రయివేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతూ హాస్టల్లో ఉంటుంది. మూడు రోజులు క్రితం ఆరోగ్యం బాగాలేక ఇంటికి వచ్చినట్లు తెలిపారు. శనివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయిందన్నారు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రాయితీపై ఉలవలు పంపిణీ

ప్రజాశక్తి-తలుపుల


మండలంలోని నూతన కాలువ సచివాలయంలో శనిఆవరం వ్యవసాయ అధికారులు కృష్ణమోహన్, రవి ఆధ్వర్యంలో సబ్సిడీ ఉలవలు పంపిణీ చేశారు. టిడిపి నాయకులు ముఖ్య అతిథు లుగా పాల్గొని ఉలవలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు డి.గంగరాజు, వెంకటరమణప్ప, వెంకటస్వామి, జి.వెంకటరమణ, రామచంద్ర, జయరామ్, బండ్లపల్లి, నూతనకాలువ, పొలతలవాండ్లపల్లి రైతులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో అన్నదానం ప్రారంభం

ప్రజాశక్తి-బత్తలపల్లి

స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం నుంచి మాలధారులకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ముందుగా ఆలయాన్ని, స్వామి మూలవిరాట్‌ను సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం మాలధారులకు అన్నదానం చేశారు. అయ్యప్ప సేవా సంఘం కమిటీ సభ్యులు జక్కంపూటి పురుషోత్తం చౌదరి మాట్లాడుతూ దాతల సహకారంతో డిసెంబర్ 31వ తేదీ వరకూ ప్రతి రోజూ మధ్యాహ్నం 1 గంట నుంచి అన్నదానం చేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ గౌరవాధ్యక్షులు జక్కంపూడి సత్యనారాయణ, సభ్యులు అక్కిం ప్రతాప్, మదనాపు ఆదినారాయణ, అజయ్‌చౌదరి, వెంకటచౌదరి, అన్వేష్, మదనావు రాజశేఖర్, జొన్నలగడ్డ రంగానాయుడు, రాము, చిట్టి, ఓబుళనాయుడు, యాపిల్ నాయుడు, శ్రీనివాసులు, యంగముని, తిక్కస్వామి, అయ్యప్ప మాలధారులు, శివస్వాములు పాల్గొన్నారు.


అయ్యప్ప, శివ మాలధారులకు అన్నదానం ఏర్పాటు చేసిన ఆలయ కమిటీ సభ్యులు


కొత్తచెరువు గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

పుస్తక పఠనంతో విజ్ఞానం

కొత్తచెరువు : విద్యార్థులు పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని గ్రంథాలయ అధికారి ఎంసి.రమేష్‌నాయక్ తెలి పారు. 58వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా రెండో రోజైన శనివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. విద్యార్థులకు పుస్తక పఠనం ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు రోజూ గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలు, పత్రికలు, పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు చదివి విజ్ఞానం పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంపిడిఒ మహమ్మద్, పాఠకులు మహేష్, రాఘవేంద్ర, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

నంబులపూలకుంట : స్థానిక గ్రంథాలయంలో అధికారిణి పర్వీన్‌భాను ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. దీంతో జడ్పీ హైస్కూల్ విద్యార్థులు, పాఠకులు పుస్తక ప్రదర్శనను పరిశీంచారు.

బత్తలపల్లి : స్థానిక శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన-ఏర్పాటు చేశారు. గ్రంథాలయ అధికారిణి రాజేశ్వరి విద్యార్థులకు పుస్తకం ఆవశ్యకతను వివరించారు. స్వాతంత్ర్య సమరయోధులు, విజ్ఞానం, వినోదం, కథలు, కవితలు, ఆధ్యాత్మిక పుస్తకాల ను ప్రదర్శించారు. కార్యక్ర మంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.


బత్తలపల్లిలో పుస్తకప్రదర్శలో పాల్గొన్న విద్యార్థులు

గొంతు నొక్కుతున్నారా.!



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలు, పత్రికలు ఎంతో కీలకం. పాలకుల తప్పొప్పులను తెలియజేసి వాటిని ప్రభుత్వం సరిచేసుకునే విధంగా ఉండాలి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ రెండింటిపైనా దాడులు పెరుగుతున్నాయన్న ఆందోళన సర్వత్రా నెలకొంటోంది. ఈ వారంలో చూస్తే సమస్యలపై గళమెత్తే వారిని అణచివేసే ప్రక్రియ కొనసాగుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అంతకు మునుపు వారంలో మట్టిమాఫీయ పై పత్రికల్లో కథనాలొచ్చాయని విలేకరి పెద్దన్నపై మట్టిమాఫీయ అర్థరాత్రి సమయంలో ఇంటికెళ్లి బెదిరింపులకు పాల్పడింది. ఎటువంటి అనుమతుల్లేకుండా పేదలకు ఇంటి పట్టాలిచ్చిన ప్రభుత్వ లే అవుట్‌లో మట్టి నిరంతరాయంగా తోలుతున్నా చర్యలుండటం లేదు. కథనం రాసినందుకు ఒక విలేకరిని ఫోనులో బెదిరించగా, మరో విలేకరి ఇంటికెళ్లి బెదిరింపులకు దిగిన ఘటన జరిగింది. ఇది మరువక ముందే సత్య సాయి జిల్లాలో హిందూపురం అసెంబ్లీ నియోజక వర్గంలోని చిలమత్తూరు మండలంలో రోడ్డు నిర్మాణం నాసిరకం అని వార్త రాసిన విలేకరిపై అధికారపార్టీ నేతలు దాడి చేశారు. దీనిపై ఫిర్యాదు చేస్తే విలేకరే దాడి చేసాడని ప్రతి ఫిర్యాదు ఇవ్వడమే కాకుండా మూడు రోజుల తరువాత అదే విలేకరిపై ఎస్సీ,ఎస్టీ కేసును సదరు అధికారపార్టీ నేతలు చేశారు. అంతటితో ఆగకుండా ఇప్పటికీ బెదిరింపులకు పాల్పడుతుండటం గమనార్హం. ఇక హిందూపురంలో ఏకంగా వైసిపి కార్యాలయంపై అధికార పార్టీ నేతలు దాడి చేయడం పట్ల అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వైసిపి నాయకులు తప్పుగా మాట్లాడి ఉంటే దానికి వ్యతిరేకంగా చర్యలు తీసుకునేందుకు చట్టపరంగా అవకాశాలు న్నాయి. గతంలో ఇదే రకంగా తప్పుగా మాట్లాడిన వైసిపి నాయకులపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకుంటూ ఉంది. ఇదే రకంగా చేయాల్సింది పోయి ఏకంగా కార్యాలయంపై దాడి చేసి ధ్వంసం చేయడం ప్రజాస్వామ్యయుతం కాదని పలువురు అభిప్రాయాలను వ్యక్తం చేస్తుండటం గమనార్హం. ఇలా ఎక్కడ సమస్యలు లేవనెత్తే ప్రయత్నం చేసినా అణచివేసే విధంగా అధికారపార్టీ నేతల తీరు కొంత మంది ఉంటున్నారు. గుత్తి మండలం బేతేపల్లిలో నూ సోలార్ విద్యుత్ పరిశ్రమలకు భూములు ఇవ్వడంపై అవగాహన కల్పించేందుకు ఎపి రైతు సంఘం నాయకులు వెళితే ఆ నియోజకవర్గం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఏకంగా ఫోన్ చేసి రైతు సంఘం నాయకులపై నోరు పారేసుకోవడమే కాకుండా తక్షణం ఇక్కడి నుంచి పోవాలని హెచ్చరికలు జారీ చేసిన ఘటన కూడా చోటు చేసుకుంది. ఇదే నియోజకవర్గంలోనే తమ గురించి ఎవరైనా కథనాలు రాస్తే రైలు పట్టాలపై పడుకోబెడతామన్న బెదిరింపులు బాహాటంగానే నడిచాయి. ఇక ఒక నియోజకవర్గంలో ప్రతిపక్ష పార్టీ చెందిన మాజీ ప్రజాప్రతినిధిని అడుగుపెట్టనివ్వకుండా అడ్డుపడు తున్న సందర్భాలూ ఉంటున్నాయి. ఇలా వరుసగా జిల్లాలో చోటు చేసుకుంటున్న పరిణామాలు గతంలో ఎన్నడూలేనంతగా పెరుగుతున్నాయన్న ఆందోళన సర్వత్రా నెలకొంది. అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అధికారపార్టీ నేతలు అక్కడక్కడా చేస్తున్న ఇటువంటి చర్యలను నిలువరించేందుకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకుంటుందో చూడాల్సి ఉంది. ఇవి ఇలాగే కొనసాగితే ప్రజల్లో అసంతృప్తి, వ్యతిరేకత పెరిగే అవకాశం లేకపోలేదన్న అభిప్రాయం ప్రజాస్వామికవాదుల నుంచి వ్యక్తమవుతోంది.